## 2023 ప్రపంచకప్ తర్వాత 9 వన్డేలే..
### ఈ సన్నద్ధత సరిపోతుందా..?




# మానేరు జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



19.2.2025
బుధవారం wednesday

సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 308

పేజీలు : 8
Pages : 8

Published from : Karimnagar




# రైతులకు శుభవార్త

- పంటల రక్షణకు మరో పథకం 02
- పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీం పెట్టే యోచన
- డ్రిప్, తుంపర సేద్య పరికరాల అందించేందుకు సిద్ధం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



## కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

- అర్ధరాత్రి దాటిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులు 02



# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

## ఎక్కడో ఉండి చేసే నేరాలే సవాల్‌గా మారాయి

- సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 కొత్త పోలీసు స్టేషన్లు
- సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసుల ముందంజ
- ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు
- 'షీల్డ్ 2025'లో కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన పాల్గొన్నారు.

**హైదరాబాద్, జనతా న్యూస్:** సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన మాట్లాడుతూ.. 'సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్ముని తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఏక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసు కోవడం కష్టంగా మారిపోయిందన్నారు.

మిగతా 2 లో



## స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- గోయాస్ హబ్‌తో ఒప్పందం 02

# కేసీఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు



- ఇప్పుడేమో బిచ్చమేసినట్లు రైతుభరోసా
- రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా
- 15వేలు అని చెప్పి అన్నదాతలను మోసం చేశారు 03
- ఏడాది దాటినా ప్రయోజనం లేదు
- ఆమనగల్ రైతు ధర్నాలో కేటీఆర్



## అర్థంపర్థంలేని హామీలతో సీఎం గందరగోళం

03

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు ఖాయం : ఎంపీ ఈటలరాజేందర్

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

### ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తోంది నీటిపారుదల శాఖ మంత్రుల భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, జనతా న్యూస్:** కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్

మిగతా 2 లో

## పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలు

- భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నాం 02
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# రంజాన్ మాసంలో ప్రత్యేక ఏర్పాట్లు

- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, జనతా న్యూస్: మార్చి 2వ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయా ల్సిన ఏర్పాట్ల పై డా. బీఆర్ అంబేద్కర్ సచివాల యంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా.. జీహెచ్ఎంసీ రంజాన్ నెలలో నగరంలో పరిశు భ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు.

మిగతా 2 లో



# రేప్ కేసులో చార్జ్‌షీట్ మారుస్తామని..

- 20 వేల లంచం డిమాండ్
- ఏసీబీకి చిక్కిన మక్తల్ సీఐ, కానిస్టేబుళ్లు



02




## మహిళల క్యాన్సర్లకు టీకా

త్వరలోనే అందుబాటులోకి..
కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

## పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరు

- బిసి కులగణన గతంలో ఎప్పుడూ చేయలేదు
- రాష్ట్రంలో వందశాతం సక్రమంగా కులగణన
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పా టు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. అయితే నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని అన్నారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం రేవంత్ అభినందించారు. తెలంగాణను నంబర్ వన్ సైబర్-సేఫ్ స్టేట్‌గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉ ందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఎఐ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది. మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ



బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని సిఎం అన్నారు. ఈక్రమంలో సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు.. నేరం జరగకుండా నిరోధించేలా చూడాల్సి ఉ ందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ తో పాటు ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఉ ంది. సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుదామని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. 'సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది' అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్‌క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 'సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్‌క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం' అని వివరించారు. ఈ సమావేశంలో 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఇంత విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లను సీజ్ చేశామని.. అందులో రూ.183 కోట్లు 18 వేల మంది బాధితులకు అందించామని పేర్కొన్నారు.



## రైతులకు ప్రభుత్వం శుభవార్త

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త చెప్పనుంది. పంటల రక్షణ కోసం కొత్త స్కీం తీసుకురానుంది. దీంతో పాటు.. రైతుల అవసరాలకు సంబంధించిన పరికరాలను అందించే యోచనలో సర్కార్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతేకాకుండా.. పామాయిల్‌తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పాటు.. రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో ఆయిల్ పామ్ కర్మాగారం అందుబాటులోకి రానుందని.. మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అలాగే.. మెకడమియా పంట సాగుకు అవసరమైన పరిస్థితులను.. అనువైన ప్రాంతాలను అధ్యయనం చేయాల్సిందిగా ఉ ద్యానశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రగతి చూపని ఆయిల్ పామ్ కంపెనీలపై చర్యలు ఆరంభించాలని.. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసినట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. మొత్తం మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేశారు. మొదటగా ఒక ఎకరం ఉన్నవారికి, మరోసారి రెండు ఎకరాలు ఉన్నవారికి, ఈనెల 12న మూడు ఎకరాల ఉన్న రైతుల అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ చేసింది.

## జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి 18 :** తెలంగాణ ప్రభుత్వం జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి వీసీని నియమించింది. వైస్ ఛాన్సలర్ గా టీ కిషన్ కుమార్ రెడ్డిని నియమించింది. వీసీ నియామకానికి సంబంధించిన ఫైల్ పై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి.. పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. గతేడాది మే 21న ఖాళీ అయిన వర్సిటీ వీసీ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా సాంకేతిక కారణాల రీత్యా నియామక పక్రియ వాయిదా పడింది. తాజాగా జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వీసీని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం లో పలు యూనివర్సిటీలకు ప్రస్తుతం ఉన్న ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ల స్థానంలో రెగ్యులర్ వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 :** భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికి నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో మ-ుగిసింది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన



1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.

## స్టార్టప్‌లకు తెలంగాణ ప్రోత్సాహం

**హైదరాబాద్,ఫిబ్రవరి 18 :** స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్‌ఐసీసీలో గోయాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. ÷ుార్కెట్ యాక్సెస్ తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.

### వేములవాడ ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో శివరాతరి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహాశివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, ఆలయ అధికారులు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ఉత్సవాలకు రావాలని వేడుకున్నారు.

## పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలు

### భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నాం.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 18:** పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలుకు భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఎంసీహెచ్‌ఆర్డీలో రెవెన్యూశాఖ అధికారులతో సమీక్ష జరిపిన పొంగులేటి.. గత సర్కార్ హయాంలోని రెవెన్యూ చట్టంలో అన్నీ లోపాలు,లొసుగులే ఉ న్నాయన్నారు. చట్టం తీసుకొచ్చి మూడేళ్లైనా విధివిధానాలు రూపొందించలేదన్నారు. మేధావులు,నిపుణులతో చర్చించి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిని తీసుకొచ్చిందని చెప్పారు పొంగులేటి. భూ భారతి చట్టం తరతరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. వీలైనంత త్వరగా విధివిధానాల రూపొందించి.. భూ భారతి రెవెన్యూ చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టం పెను మార్పులు తీసుకొస్తుందన్నారు. 2024 డిసెంబర్ 20 తెలంగాణ భూ భారతి 2024 బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. జనవరి 9న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన పోలీసులు

**నారాయణ,ఫిబ్రవరి18 :** నారాయణపేట జిల్లా మక్తల్‌లో సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఓ కేసులో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు.. మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భద్రాద్రి జిల్లాలో మరో ఘటనలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు ఏసీబీకి చిక్కారు. అటవీ భూమి నుంచి మట్టి తవ్వుకునేందుకు రైతు వద్ద రూ.30 వేలు లంచంగా సిబ్బంది అడిగారు. దీనిపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఇల్లెందు మండల కొమరారం ఫారెస్టు రేంజ్ ఆఫీసులో దాడులు నిర్వహించారు.




## కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు


మొదటి పేజీ తరువాయి

ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల పక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## మహిళల క్యాన్సర్లకు టీకా

### త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నాం

### కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్





**ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి 18 :** మహిళల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి వస్తుందని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. ఈ టీకా వేసుకొనేందుకు 9 నుంచి 16 ఏళ్ల లోపు వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఈ టీకాపై పరిశోధనలు దాదాపు పూర్తి కావొచ్చాయని.. ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రులలో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు డేకేర్ క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. క్యాన్సర్ చికిత్సకు వినియోగించే ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేశాం. అందుబాటులోకి రాబోయే ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నియంత్రిస్తుంది' అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఆయుష్ సౌకర్యాలుగా మార్చడంపై విలేకర్లు ప్రశ్నించగా.. ఆసుపత్రులలో ఆయుష్ విభాగాలు ఉన్నాయని.. ప్రజలు ఈ సౌకర్యాలను పొందొచ్చన్నారు.

## రంజాన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి దీపాలు మరమత్తులు, తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ చెప్పారు. అలాగే.. రోడ్ల మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు. మక్కా మసీద్, రాయల్ మాస్క్, మిరాలం ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ టీం ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని డిపా÷-టం÷-మెంట్స్ కలిపి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయం చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద వాటర్ ప్యాకెట్స్ ఏర్పాటు, తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు.. మసీదులకు వెళ్లే దారిలో డ్రైనేజీల రిపేర్ పూర్తి చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రంజాన్ నెలలో మొబైల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ తగ్గ సప్లై ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మసీదుల వద్ద ఈద్గాల వద్ద విద్యుత్ ఎమ్జర్గ÷న్సీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మసీదుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్ల కోసం బారికేట్లు ఏర్పాటు చేయడానికి ఆర్‌అండ్‌బీ విభాగం సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. రంజాన్ నెల నేపథ్యంలో ప్రజలకు పాల ఇబ్బందులు లేకుండా ఉండడానికి అవసరాలకు తగిన పాలను సరఫరా చేస్తామని డైరీ అధికారులు తెలిపారు. ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం నాలుగు గంటలకే విధులు ముగించేలా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని జేఏడీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలిపారు. రంజాన్ పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. రంజాన్



పండుగ దృష్ట్యా ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు కలిగించకూడదని కోరారు. పండగ రోజు ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని.. ఈద్గాలు, మసీదుల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని.. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులకు పండగ నిర్వహించుకోవడానికి సమయానికి రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 19 ఫిబ్రవరి 2025


# కేసీఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు



- ఇప్పుడేమో బిచ్చమేసినట్లుగా రైతుభరోసా
- రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా
- 15వేలు అని చెప్పి అన్నదాతలను మోసం చేశారు
- ఏడాది దాటినా ప్రయోజనం లేదు
- ఆమనగల్ రైతు ధర్నాలో కేటీఆర్

**రంగారెడ్డి, ఫిబ్రవరి 18 :** పదేండ్ల పాటు కేసీఆర్ హయాంలో రైతు ఒక రాజులాగా బ్రహ్మాండంగా బతికాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదిహేను నెలల కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎవరికీ న్యాయం చేయలేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, మహిళలకు రూ. 2500 రాలేదు. 420 హామీలిచ్చి దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శలు గుప్పించారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ ప్రసంగించారు. సొంత నియోజకరవ్గరం, సొంత తాలుకాలో కూడా ఒక్కపని చేయలేదు. సొంతూరికి, అత్తగారి ఊరికి ఏం చేసిండో అడుగదామని వచ్చానని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదు. రైతుబంధు కూడా రాలేదు. టకీటకీమని పైసలు పడలేదు. గత 6 నెలల నుంచి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నాం. గత పదేండ్లలో మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలలేదు. అప్పుడు అప్పు అడిగే పరిస్థితి లేదు. నాట్లు వేసే నాటికి రైతుబంధు పడుతుండే. రేవంత్ రెడ్డి కొత్త పదం పట్టుకుని టకీ టకీమని పడుతాయ్ అన్నాడు. టకీ లేదు టుక్ లేదు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు కేసీఆర్ బిచ్చమేసినట్లు రూ. 10 వేలు ఇస్తుండు.. నేను రూ. 15 వేలు వేస్తా అన్నాడు. కనీసం 10 శాతం మందికి కూడా రైతుబంధు ఇవ్వలేదు. ఒకేసారి రుణమాఫీ చేస్తా అని అన్నాడు. చారణా కూడా రుణమాఫీ చేయలేదు. 10 శాతం మందికి కూడా బోనస్ పడలేదు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని కేటీఆర్‌అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. 'కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు ఢిల్లీ విమానం ఎక్కారు.. 35 పైసలూ తీసుకురాలేదు. అప్పులు కట్టలేదని రైతుల తలుపులు ఎత్తుకెళ్లారు.. రేపో మాపో పుస్తెలతాడు కూడా లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలి. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు సొంత ఊరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం. కులగణన పేరుతో బీసీలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు' అని కేటీఆర్ ఆరోపించారు. మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగే..

పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగా కనపడుతుందన్న సామెతలా సీఎం రేవంత్‌రెడ్డికి తను మూటాలు తీసుకుంటున్న మాదిరిగా ఐఎఎస్‌లు తీసుకుంటున్నారని అనుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

# పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరు

**బిసి కులగణన గతంలో ఎప్పుడూ చేయలేదు**

**రాష్ట్రంలో వందశాతం సక్రమంగా కులగణన**

**మీడియాతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18:** రాజకీయ పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరని శాసనమండలిలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం 100 శాతం కులగణన సర్వే పర్ఫెక్ట్ చేసిందని తెలిపారు. అసలు కులగణన మీద బీసీల జనాభాపై లెక్క ఎక్కడ ఉంది.. దేశంలోనే ఇదే మొదటిసారి బీసీ కులగణ చేసిందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. కేటీఆర్ రైతు దీక్షపై కౌంటర్ ఎటాక్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతు దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. కరెంట్ కట్ అయినా.. ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన రైతులే రోడ్డెక్కుతారు.. సమగ్ర కుటుంబ సర్వే ఆఫిషియల్ రికార్డు లేదు.. బీసీ కులగణన సర్వే సరైనదని తెలిపారు. నాయకుడికి కులం, మతంతో సంబంధం ఉండదు.. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు.. బీజేపీ బీసీ కులగణకు వ్యతిరేకమని అందరికి తెలిసిందే.. వ్యవస్థలపై గౌరవం తగ్గుతున్న మాట వాస్తవమే.. రాజకీయం, ప్రభుత్వ సంస్థలు ఇతర వ్యవస్థలపై సైతం నమ్మకం తగ్గుతుందని ఆయన ఆరోపించారు. కాగా.. ఉచితాలపై ఒక కఠినమైన చట్టం రావాల్సిందేనని అన్నారు. కేసీఆర్ త్యాగాలు చేసింది నిజమే.. తెలంగాణ ఉద్యమం నడిపించింది వాస్తవమే.. కానీ 4 కోట్ల ప్రజలు హీరో అంటే.. మరి ఎన్నికల్లో 4 కోట్ల ప్రజలు ఓట్లు వేయలేదు కదా?! అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నువ్వు నేను కోరుకుంటే ఎన్నికలు రావు.. ప్రభుత్వం పడిపోతుంది అంటే అది అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని ప్రజలు అనుకుంటారు.. ఈ ప్రభుత్వ పాలన పర్వాలేదని గుత్తా తెలిపారు. జమిలి ఎన్నికలపై గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కలిసి వస్తే పార్టీలపై, ప్రభుత్వంపై, అభ్యర్థులపై భారం తగ్గుతుందని అన్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఉన్న ఓటర్లే తక్కువ.. ఎన్నికల కోడ్, ప్రభుత్వ పరిపాలనపై ప్రభావం చూపిస్తోందని తెలిపారు. కోడ్ ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని ఈసీకి లేఖ రాశానని చెప్పారు.



# కుంచించుకు పోయిన బతుకమ్మకుంట

**ఆక్రమణలతో ఆనవాళ్లు మాయం**

**పునరుద్ధరణ పనులు చేపట్టిన హైడ్రా**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** అంబర్ పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణన పనులను హైడ్రా మొదలు పెట్టింది. పునరుద్ధరలో భాగంగా మంగళవారం బతుకమ్మ కుంటలో హైడ్రా పూడిక తీత పనులు చేపట్టింది. ఇందులో భాగంగా కుంటలో జేసీబీతో కొంత మేర మట్టి తీయగానే నీళ్లు బయటకు వచ్చాయి. గతంలో ఇక్కడ చెరువు ఉండటం వల్లనే నీళ్ళు బయటపడ్డాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు. అంబర్ పేట మండలం బాగ్ అంబర్ పేట్ లోని సర్వే నంబరు 563 లో 1962- -63 లెక్కల ప్రకారం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉంది. బఫర్ జోన్ తో కలిపి మొత్తం16.13 ఎకరాలు. అయితే తాజా సర్వే ప్రకారం అక్కడ 5.15 ఎకరాలు మాత్రమే మిగిలింది. దీన్ని హైడ్రా పనరుద్దరిం చేందుకు చర్యలు చేపట్టింది. ఇక్కడ ఉంటున్న వారికి సమస్య లేకుండా చెరువును పునరుద్ధరించనున్నారు అధికారులు. బ్యూటిఫికేషన్?చేపట్టనున్నారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయిందంటున్నారు. అంబర్?పేట పరిధిలోని బతుకమ్మ కుంట స్థలం తమదేనంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 జనవరి 8న హైకోర్టు కొట్టేసింది. హైడ్రాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైడ్రా పునరుద్ధరణ చర్యలు చేపట్టింది.

# అర్థంపర్థంలేని హామీలతో సీఎం గందరగోళం


■ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు ఖాయం : ఎంపీ ఈటల



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** అర్థంలేని హామీలతో సీఎంరేవంత్ ఆయన గందరగోళానికి గురికావడమే కాకుండా, ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి సరోత్తం రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పీఆర్సీ ఏమైంది... డీఏలు ఏమయ్యాయని నిలదీశారు. సీపీఎస్ విధానంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని అడిగారు. గతంలో యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ పాలనలో దేశం సుభిక్షమని.. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయలకు అండగా ఉంటామని.. సమస్యల పరిష్కారానికి కొట్లాడతామని స్పష్టం చేశారు. కులాన్ని విస్మరించలేమని.. కుల గణన జరగాలన్నారు. కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే అధికారికంగా లెక్కలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతి నిర్ణయం బూమరాంగ్ అవుతోందన్నారు. 2011 జనాభా లెక్కలకు ఇప్పటి లెక్కలకు పొంతన లేకుండా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని.. డ్రామా కంపెనీలా చేయవద్దని హితవుపలికారు. ఈ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ దేశంలో ఎన్నడైనా ఎక్కడైనా కాంగ్రెస్ బలహీన వర్గాలకు పదవులు కట్టబెట్టిందా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో లేదా ఇప్పుడు బలహీన వర్గాలకు చెందిన నేతలు ముఖ్య మంత్రులయ్యారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల భూములు ఇలా ప్రతి విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే రోజులలలో కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కొట్లాడతామని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

# ఎస్ఐ వేధింపులు భరించలేకపోతున్నాం..

**ఆత్మహత్యకు అనుమతించండి..? ● ఫ్లెక్సీతో భార్యాభర్తల నిరసన**




**భూపాలపల్లి,ఫిబ్రవరి 18:** సాధారణంగా అప్పులు చేసి తీర్చలేకనో, లేకపోతే ప్రేమలో విఫలమయ్యాం అనో.. లేక మార్కులు తక్కువొచ్చాయని, ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తుంటాం. కానీ ఎస్సై వేధింపులు తట్టుకోలేకపోతున్నాం.. ఆత్మహత్యకు అనుమతించండి సార్ అంటూ దంపతులు ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తమకు చావే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన సంది సులోచన, ప్రతాప్ రెడ్డి దంపతులకు 12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి వెళ్లడానికి ఉన్న దారిని రెండున్నరేళ్లుగా ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా పనిచేస్తున్న ఇనిగాల వెంకటేష్, అతడి సోదరుడు, తండ్రి కలిసి మూసివేశారని దంపతులు ఆరోపించారు. తమ సమస్యపై హైదరాబాద్ వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఆ ఎస్సై తమపై అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడేళ్ల నుంచి తమ పొలానికి వెళ్లలేక వ్యవసాయం చేయట్లేదని.. తమకు ఆత్మహత్య తప్ప వేరే దారి లేదని వాపోయారు. కనీసం ఆత్మహత్యకు అనుమతించాలని ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట వృద్ధ దంపతులు నిరసన తెలపడంతో తెలంగాణ వ్యాప్తంగా ఈ ఘటన హాట్ టాపిక్ అవుతోంది.


# యూ బెగ్గర్ అనడం వల్లే హత్య

**జనార్దన్‌రావు హత్య కేసులో నోరువిప్పిన నిందితుడు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత జనార్దన్ రావు హత్య సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత మనమడే ఆయన్ను 72 సార్లు కత్తితో పొడిచి చంపేయడం తీవ్ర కలకలం పేరింది. ఈ కేసులో నిందితుడు కీర్తి తేజను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కీర్తి తేజను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. నాలుగు రోజులుగా నిందితుడిని విచారించిన హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. మొదటి రోజు కీర్తి తేజ నోరు విప్పకపోయినప్పటికి ఆ తర్వాత హత్యకు గల కారణాలను కీర్తి తేజ పోలీసులకు వివరించాడు. పోలీస్ కస్టడీలో భాగంగా మొదటి రోజు పారిశ్రామివేత్త జనార్దన్ రావును ఎందుకు హత్య చేశావంటూ పంజాగుట్ట పోలీసులు కీర్తి తేజను ప్రశ్నించారు. రెండో రోజూ నిందితుడిని హత్య జరిగిన ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు ప్రయత్నించారు. అక్కడా నోరు విప్పలేదు కీర్తి తేజ. కానీ, నిందితుడు పారిపోయిన తర్వాత మంటల్లో కాల్చివేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం మాత్రం ఎట్టకేలకు కీర్తి తేజ అసలు విషయాలు వెల్లడించాడు. యూ బెగ్గర్ అంటూ తాత జనార్దన్ రావు ప్రతిరోజూ నన్ను అవమానించేవాడు. ఏ రోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా భావించలేదు. అందరి కంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు. ప్రతీరోజూ బెగ్గర్.. బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసేవారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవినీ రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పట్నుంచి నాకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నా. ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేసా. బట్టలు తగలబెట్టేందుకు అమెజాన్ బ్యూటేన్ గ్యాస్ కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలు తగులబెట్టానని" తెలిపాడు.

# మూసీపై 17 బ్రిడ్జిల సర్వే




**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** మూసీ ప్రక్షాళనకు సంబంధించి తెలంగాణ సర్కాం మరో ముందడుగు వేసింది. మూసీ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. మూసీపై ఉన్న 17 బ్రిడ్జిలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే చేయిస్తోంది. నిజాం కాలంలో కట్టిన బ్రిడ్జిల పటిష్టతను ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలిస్తున్నారు. రీబౌండ్ హ్యామర్ టెస్ట్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, డైనమిక్ లోడ్ టెస్టింగ్‌ను సంస్థ నిర్వహిస్తోంది. నాగోల్, ఇమ్లి బండ్, ముస్లింజంగ్, నయాపూల్, పురాణాపూల్, టిప్పు ఖాన్, బాపూఘాట్, అత్తాపూర్, చాదర్ఘాట్, గోల్నాక, సాలార్జంగ్ ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను సంస్థ ప్రతినిధులు పరిశీస్తున్నారు. బ్రిడ్జిల పటిష్టతపై మరో నెలలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు. చాధర్ ఘాట్ బ్రిడ్జి హైట్ పెంచాలని నివేదికను సిద్ధం చేసింది సంస్థ. మూసీ పైనున్న బ్రిడ్జిలను వారసత్వ కట్టడాలుగా ప్రభుత్వం గుర్తించింది. అవసరం అయితేనే పూర్తిగా కూల్చి... వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో మూసరాం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. దీన్ని 29.5 మీటర్ల పొడవు, 6 లేన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే, 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.65 కోట్లతో ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

# నివురుగప్పిన అవినీతి నిప్పు!



మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమిషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్దంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమిషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్ ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్సీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్దంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ధ పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు. అందుకు రాజకీయ నేతలు సిద్దమా కాదా అన్నది చెప్పాలి.



# ఢిల్లీని వెనక్కి నెట్టిన హైదరాబాద్

- పెరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడులు
- గ్రామీణ ప్రాంత ప్రజలూ నగరబాట

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా నగరబాట పడుతున్నారు. నగరంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉండంటతో సిటీలో సెటిల్ అయ్యేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో హైదరాబాద్ నగర జన సాంద్రత పెరిగుతోంది. జన సాంద్రత విషయంలో తాజాగా దేశ రాజధాని ఢిల్లీని హైదరాబాద్ వెనక్కి నెట్టింది. తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2024 నివేదిక గణంకాలు వెల్లడించింది. నగరంలో చదరపు కిలోమీటరుకు 18,161 మంది జనాభా సాంద్రత ఉన్నట్లు వెల్లడించింది. ఈ సంఖ్య రాజధాని ఢిల్లీలో చదరపు కిలోమీటరుకు 11,313 మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. జన సాంద్రత విషయంలో ఇండియాలో ముంబై తొలి స్థానంలో ఉంది. అక్కడ చదరపు కిలోమీటరుకు 28,508 ఉన్నట్లు గణాంకాల ద్వారా వెల్లడైంది. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా నిలిచింది. అక్కడ ఒక చదరపు కిలోమీటరులో 43,079 మంది నివసిస్తున్నారు. అయితే వేగవంతమైన పట్టణీకరణ ఓ సవాల్ లాంటిదేనని నిపుణులు అంటున్నారు. అది రెండు వైపులా పదును ఉన్న కత్తి లాంటిందని చెబుతున్నారు. జనాభా పెరుగుదలతో ఓ వైపు హైదరాబాద్ నగరం వృద్ధి పథంలోకి వెళ్తున్నా.. అదే సమయంలో అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించటం ప్రభుత్వానికి శక్తికి మించిన పని అంటున్నారు. పెరగుతున్న జనాభా మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, ఇండ్ల నిర్మాణంపై ఒత్తిడిని పెంచుతాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఓ వైపు హైదరాబాద్ నగరంలో జన సాంద్రత పెరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. 2011 జనాభా లెక్కల డేటా ప్రకారం.. రాష్ట్ర జనాభా 3.5 కోట్లుగా ఉంది. తెలంగాణ మ్తొత్తం 1,12,077 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణాన్ని కలిగి ఉంది. చదరపు కిలోమీటరుకు 312 మంది జనాభా సాంద్రతను కలిగి ఉంది. 2031 నాటికి ఇది మరింత తగ్గే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో యువ జనాభా కూడా తగ్గుతున్నట్లు అంచనా వేస్తున్నారు. 2031 నాటికి 39 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారి జనాభా 0.23 శాతం తగ్గే ఛాన్స్ ఉందని అంటున్నారు. అదే సమయంలో 40 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పెరుగుతుందని.. దీని కారణంగా రాష్ట్రంలో వృద్ధ జనాభా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.

# భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు

## రిక్రూట్‌మెంట్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడి




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18:** భారత ఈవీ మార్కెట్‌లో ప్రవేశించాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెస్లా సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో సిబ్బంది నియామకాలను ప్రారంభించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు లింక్డ్‌ఇన్ వేదికగా ప్రకటించింది. దీంతో టెస్లా రాక ఖాయంమైంది. ఇటీవలే ప్రధాని మోడీ, ఎలన్ మస్క్ మధ్య చర్చలు సాగాయి. తరవాత ఈ ప్రకటన వెలువడింది. టెస్లా ప్రకటన ప్రకారం, సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతోంది. మగిలిన పోస్టులకు నియామకాలు ముంబైలో చేపడుతోంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్లా భారత్‌లో నియామకాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. టెస్లా సంస్థ కొన్నేళ్లుగా భారత విపణిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దీన్ని 70 శాతానికి తగ్గించింది. భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ చైనాతో పోలిస్తే చిన్నదే అయినా టెస్లాకు ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారింది. భారత్‌లో గతేడాది లక్ష యూనిట్ల విద్యుత్ కార్లు విక్రయం కాగా చైనాలో ఈ సంఖ్య ఏకంగా 11 మిలియన్లు. అయితే, దశాబ్దం తరువాత తొలిసారిగా టెస్లా కార్ల అమ్మకాలు తగ్గాయి. దీనికి చెక్ పెట్టేందుకు భారత మార్కెట్‌లో ఎంట్రీకి టెస్లా ప్రయత్నిస్తోందని సమాచారం. ఇటీవల డోనాల్ట్ ట్రంప్‌తో సమావేశం అనంతరం ప్రధాని మోదీ అమెరికాతో వాణిజ్యలోటుపై దృష్టి పెట్టేందుకు అంగీకరించారు. రక్షణ రంగ కొనుగోళ్ల పెంపు, ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ వంటివి తెరపైకి వచ్చాయి. ఇక ట్రంప్ కేబినెట్‌లో కీలకంగా మారిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అయితే, మస్క్ వ్యక్తిగత హోదాలో మోదీని కలిశారా లేక అమెరికా ప్రభుత్వం తరుపున సమావేశమయ్యారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వంలో మస్క్‌కు ప్రాధాన్యం పెరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ, ప్రభుత్వ అవసరాల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఇటలీ ప్రభుత్వ కమ్యూనికేషన్ కోసం స్పేస్‌ఎక్స్ సేవలు వినియోగించు కునేందుకు చర్చలు జరుగుతున్నట్టు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్‌తో ఇటలీ ప్రధాని సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

# సంక్లిష్టంగానే పోప్ ఆరోగ్యం

**రోమ్,ఫిబ్రవరి18 :** పోప్ ఫ్రాన్సిస్ (88) ఆరోగ్యం ఇంకా సంక్లిష్టంగానే ఉన్నట్లుగా వాటికన్ సిటీ తెలిపింది. గత శుక్రవారం శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూనే ఉన్నారు. మరి కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉందని వాటికన్ పేర్కొంది.ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో శ్వాసకోశంలో పాలీమైక్రోబయల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు తెలిపింది. దీన్ని నుంచి ఇంకా కోలుకోలేదని తెలిపింది. తాజాగా నిర్వహిచిన టెస్టులను బట్టి మరిన్ని రోజులు ఆస్పత్రి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాటికన్ తెలిపింది. జ్వరం నుంచి అయితే ఫ్రాన్సిస్ కోలుకున్నారని తెలిపింది. ఇక ఫ్రాన్సిప్ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు గాజాలోని ఏకైక కాథలిక్ పారిష్ వాకబు చేస్తూనే ఉన్నారు. ఇక సోమవారం పోప్ ఫ్రాన్సిస్ కొంత సేపు పని చేశారని, పత్రాలు కూడా చదివారని వాటికన్ తెలిపింది. ఫ్రాన్సిస్.. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.



# కుంభమేళాకు 55 కోట్ల భక్తుల రాక

**ప్రయాగరాజ్,ఫిబ్రవరి18:** ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా కొనసాగుతోన్న కుంభమేళాకు ఊహించని రీతిలో భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని పేర్కొంది. దేశ విదేశాల నుంచి భారీగా సామాన్యులు, ప్రముఖులు తరలి వచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక సంబరం ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. భారత్‌లోని 110 కోట్ల మంది సనాతనుల్లో దాదాపు సగం మంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. ఫిబ్రవరి 26నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా



వేస్తున్నారు. తొలుత కుంభమేళాకు 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచనా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తుతుండటం గమనార్హం. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుంభమేళాలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. సంబంధిత ఫొటోను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. మహా కుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత, ఆధ్యాత్మిక వేడుక అన్నారు. సనాతన సంప్రదాయం, వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా, సౌభాగ్యంగా ఉండాలని గంగామాతను ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే గడ్కరీ దంపతులు కూడా పుణ్యస్నానాలు ఆచరించారు.

## పోలీసుల కస్టడీలో అక్రమంగా భూమిని ఆక్రమించిన నిందితులు



కరీంనగర్ , జనతా న్యూస్: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తప్పుడు హద్దులు చూపుతూ భూమిని పలువురికి విక్రయించిన ఘటనలో అరెస్ట్ అయిన ముగ్గురు నిందితులను కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి కోటేశ్వర్ మరియు ఎస్సై రాజన్నలు మంగళవారం లీసు కస్టడీ కి తీసుకుని నిందితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ కట్టరాంపూర్ కు చెందిన సర్వేనెంబర్ 954 లో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తప్పుడు హద్దులు చూపుతూ అసలు యజమాని అయిన బాధితుడి భూమిని పలువురికి విక్రయించిన ఘటనలో 13 మందిపై కేసు నమోదు కాగా, వారిలో ప్రధాన నిందితులైన నలుగురిని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బల్మూరి రమణ రావు (50), గణేష్ నగర్ కు చెందిన దాసరి సంజీవ రెడ్డి (38),దాసరి బుచ్చి మల్లా రెడ్డి (67),క్రిస్టియన్ కాలనీ కి చెందిన మొహమ్మద్ బషీర్ (54) లను కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి కోటేశ్వర్ ఈ నెల 14వ తేదీ శుక్రవారంనాడు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి, రిమాండు విధించిగా కరీంనగర్ జైలుకు తరలించిన విషయం విధితమే. అయితే ఈ కేసుకు సంబందించిన మరింత సమాచారం సేకరించేందుకుగాను అందులో ముగ్గురు నిందితులను మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బల్మూరి రమణ రావు (50), గణేష్ నగర్ కు చెందిన దాసరి సంజీవ రెడ్డి (38), క్రిస్టియన్ కాలనీ కి చెందిన మొహమ్మద్ బషీర్ (54) లను కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి కోటేశ్వర్ మరియు ఎస్సై రాజన్నలు గళవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలీసు కస్టడీ కి తీసుకుని నిందితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి ఈ కేసుకు సంబందించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీటి ఏర్పాట్లు చేయించాలి



కరీంనగర్,జనతా న్యూస్: ఫిబ్రవరి 23 న గురుకులాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఉన్నందున పిల్లల కోసం వేసవి కాలం అయినందున పిల్లలకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనీ సెంటర్ పద్ద పాఠశాలలకు జిల్లా కలెక్టర్ లు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ గురుకులాల విద్యార్థి హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మొగురం రమేష్ ఆయా జిల్లా కలెక్టర్లు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

# మోదీ ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుంది..

### జూట మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది...
### బిజెపి అభ్యర్థులు అంజిరెడ్డి , మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి...
### బిజెపి పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి...



కరీంనగర్,జనతా న్యూస్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి కోసం కాంగ్రెస్ జూట మాటలు చెప్పిందనీ, ఆచరణ సాధ్యం కానీ , అమలు చేయలేని హామీలు వాగ్దానాలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని , అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని , బిజెపి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కకొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత వేసి గెలిపించాలని బిజెపి పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. బిజెపి తాజా మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున స్థానిక బిజెపి ముఖ్య నేతలు మరియు గ్రాడ్యుయేట్స్ తో ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణ సమావేశం జరిగింది. అనంతరం కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడారు. పట్టభద్రులను, ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్స్ ల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులకు కాంగ్రెస్ హామీ నిరుద్యోగ భృతి రూపాయలు 4000 నేటికీ ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతుందని , ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 56000 బాకీ పడిందన్నారు. పట్టభద్రు లకు ఎలాంటి ఉపాధి చూపెట్టకుండా,నిరుద్యోగ భృతి కూడా ఇవ్వని కాంగ్రెస్ సర్కార్ పట్ల పట్టభద్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. నిరుద్యోగ పట్టభద్రులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఎన్నికల్లో తగిన గుణ-పాఠం చెప్పాలన్నారు. విద్యార్థుల, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడింది కేవలం బిజెపి యే అన్నారు. అందుకే జరగబోయే ఎన్నికల్లో బిజెపి గ్రాడ్యుయేట్స్ , టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రధానంగా టీచర్ ఏమ్మెల్సీ ఎన్నికల్లో రెండు పార్టీ లు ముందే ఓటమి చెందాయనీ, ఆ రెండు పార్టీలకు అభ్యర్థి కరవయ్యారనీ ఎద్దేవా చేశారు. బిజెపి మోదీ ప్రభుత్వ పాలనలో పదేళ్ల లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందనీ, .అంతర్జాతీయ స్థాయి లో భారత్ ఖ్యాతి పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల తో నే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందనీ, .కేంద్రం ఇచ్చే నిధులు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుం దన్నారు. అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం , దేశాభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు.

బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, మాజీ మేయర్ సునీల్ రావు, డి శంకర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారి రాజేంద్రప్రసాద్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాడ వెంకట్ రెడ్డి కటకం లోకేష్ పాదం శివరాజ్ మాజీ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్లు పాల్గొన్నారు.



# బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనతా న్యూస్:

బాలికలకు చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కాశ్మీర్ గడ్డలోని ప్రభుత్వ ఎస్సీ కాలేజ్ గర్ల్స్ హాస్టల్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మంగళవారం రాత్రి సందర్శించారు. హాస్టల్ లోని మెస్, బాలికల వసతి గదులను, ఆర్వో వాటర్ ప్లాంటు పరిశీలించారు. హాస్టల్ లో కామన్ మెనూ ప్రకారం పోషకాహారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్, మెస్, స్టడీ, ఫుడ్ కమిటీ లపై వాకబు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున విద్యార్థులకు అన్ని హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కామన్ డైట్ మెనూ ద్వారా సమతుల పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాలన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. హాస్టల్ లో విద్యార్థులకు ఇచ్చిన స్వేచ్ఛ ను సద్వినియోగం చేసుకోనీ జీవితంలో రానించాలని, ఇతర విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి అని సూచించారు ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమయ్యే కెరియర్ ఆప్షన్ చాట్ ను విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కెరియర్ చాట్ ద్వారా విద్యార్థులకు ఉన్న ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్శనలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, ఎస్సీ వెల్ఫేర్ ఈడి నాగార్జున, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, హాస్టల్ ప్రత్యేక అధికారి రాంబాబు, వార్డెన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

### విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్,జనతా న్యూస్: రానున్న పదవ తరగతి పరీక్షల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధతపై మంగళవారం మండల విద్యాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం పదవ తరగతి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి పరీక్షలు పూర్తయ్యే వరకు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపవలసిందిగా కోరాలని అన్నారు. నాలుగు మోడల్ ప్రశ్నపత్రాలను ప్రత్యేకంగా తయారుచేసి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని ఎంఈఓ లకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు వంటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం విద్యార్థులు అలసిపోకుండా స్నాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల చదువును పర్యవేక్షించాలని అన్నారు. హాస్టల్ లోని విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని తెలిపారు. కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
బుధవారం 19 ఫిబ్రవరి 2025


# మండలంలో పోటా పోటీగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**ప్రచారంలో స్పీడ్ పెంచిన కాంగ్రెస్, బిజెపి పార్టీల శ్రేణులు.**





జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీల కార్యకర్తలు పోటా పోటీగా దూసుకెళ్తున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి లక్ష్మీపూర్ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ బలపరుస్తున్న ఊట్కూరి ( ఆల్ ఫోర్స్ ) నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. అలాగే మరోపక్క బిజెపి పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షులు కొలిపాక రాజు, రాష్ట్ర కిషన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డితో కలిసి మంగళవారం బిజెపి పార్టీ శ్రేణులతో వీరాపూర్, బేగంపేట గ్రామాలలో తమ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల, మరియు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులైన చిన్నమాయిల్ అంజిరెడ్డి, ముల్క కొమురయ్య లను గెలిపించాలని ఇంటింటా ప్రచారంలో పట్టభద్రులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మీపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు రెడ్డి రామకృష్ణారెడ్డి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర హరీష్, రెండ్ల రమేష్, బిజెపి నాయకులు మానకొండూరు ఎన్నికల ఇంచార్జీలు గుర్రాల వెంకటరెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల ఇన్చార్జీలు సాన వేణు, దారం సత్తిరెడ్డి, బిజెపి నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, రాచకొండ శ్రీధర్ రావు, సుధీర్ రావు, గంప రవికుమార్, బుర్ర క్రాంతి కుమార్ గౌడ్, కొరివి అమర్, ఒగ్గు కనకయ్య, బుర్ర కిషన్, బుర్ర వినీత్, రేవోజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కోసం రోడ్డెక్కిన బేగంపేట ప్రజలు



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామం లో అసంపూర్తిగా వదిలేసిన బీటీ రోడ్లు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ పై అసహనం వ్యక్తం చేస్తూ గ్రామ ప్రజలు రోడ్డుపై మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బేగంపేట మాజీ సర్పంచులు చింతలపల్లి సంజీవరెడ్డి, పోతు రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బేగంపేటలో కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పోసి దుమ్ము, దూళి తో బాటసారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,అలాగే వాహనాదారులు కంకరపై బ్యాలెన్స్ తప్పి కింద పడ్డ సందర్భాలు చాలానే ఉన్నాయని , అసంపూర్తి రోడ్డును సంపూర్ణంగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సహకరించాలని బేగంపేట గ్రామ ప్రజల తరఫున అధికారులకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అసంపూర్తిగా వదిలేసిన బెజ్జంకి తారు రోడ్డును కూడా పూర్తిచేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలా శేఖర్ బాబు, కొరివి లక్ష్మయ్య, కొరివి మల్లయ్య, కొరివి సంపత్, చంద్రమౌళి, పోచమల్లు, గొడుగు రాజయ్య, రమేష్, గొడుగు సంతోష్, పున్నం నాగరాజు, పట్నం కిరణ్, రాజేందర్, గుండ కమలాకర్ రెడ్డి, ఎరవెల్లి వెంకటి, ప్రేమ్ రాజ్, బెజ్జంకి రాజయ్య, కీసర సంపత్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి గుట్టపై లక్ష్మీ నరసింహ స్వామి కీ ప్రత్యేక పూజలు



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషం మధుసూదనా చారి మాట్లాడుతూ, స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా నరసింహస్వామి కీ ప్రత్యేక పూజలు జరిపినట్లు తెలిపారు. భక్తులకు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ వేడుకలలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, అలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రవీణ్ , సునీత, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీలు చివరకు ఫ్లాట్ గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76,073.71 (క్రితం ముగింపు 75,996.86) వద్ద ఫ్లాట్‌గా ట్రేడింగ్ మొదలుపెట్టింది. రోజంతా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. ఇంట్రాడేలో 75,531.01 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 20 పాయింట్లు తగ్గి 75,967 వద్ద ముగిసింది. నిఫ్టీ 14 పాయింట్లు నష్టంతో 22,945 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.96 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ఇండ్ బ్యాంక్, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు నష్టపోయాయి. ఎన్టీపీసీ, టెక్‌మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.84 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,925.20 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## రూ.81 వేల కోట్లు.. మార్కెట్ దెబ్బకు పెద్ద మదుపర్ల సంపద హుష్‌కాకి!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గత కొన్ని నెలలుగా తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి. దీంతో చాలామంది రిటైల్ ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు కరిగిపోయాయి. ముఖ్యంగా కొత్తగా మార్కెట్‌లోకి వచ్చినవారు ఈ నష్టాలు చూసి తలలు పట్టుకుంటున్నారు. సాధారణ మదుపర్లే కాదు.. దేశంలోని పెద్ద పెద్ద మదుపర్లుగా పేరొందిన వారి పోర్ట్‌ఫోలియోలూ ఇందుకు మినహాయింపు కాదని తాజా డేటా చెబుతోంది. సెన్సెక్స్ గతేడాది గరిష్ఠంగా 85 వేల మార్కు దాటింది. నిఫ్టీ సైతం 26 వేల మార్కును అందుకుంది. ఆ తర్వాత మొదలైన అమ్మకాల ఒత్తిడితో రెండు బెంచ్ మార్క్ సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 11 శాతం కరెక్షన్‌కు లోనై ప్రస్తుతం 75 వేల పాయింట్ల వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ ఏకంగా 15 శాతం క్షీణించి 22,800 స్థాయి వద్ద కొనసాగుతోంది. అక్టోబర్ 1 నుంచి పరిగణనలోకి తీసుకుంటే దేశంలో ప్రముఖ మదుపర్లుగా పేరొందిన టాప్-10



వ్యక్తుల పోర్ట్‌ఫోలియోలు రూ.81 వేల కోట్ల మేర నష్టపోయినట్లు ప్రైమ్‌ఇన్ఫోబేస్ నివేదిక చెబుతోంది. అంటే దాదాపు 30 శాతం అన్నమాట. అదే జనవరి 1వ తేదీ నుంచి చూస్తే ఈ మొత్తం 25 శాతంగా ఉంది. డీమార్ట్ పేరుతో రిటైల్ చైన్ నిర్వహిస్తున్న రాధాకృష్ణ దమానీ వ్యాపారవేత్తే కాదు.. ప్రఖ్యాత మదుపరి కూడా. ఆయన సంపద అక్టోబర్ 1 నుంచి దాదాపు 28 శాతం మేర క్షీణించింది. అంటే దాదాపు రూ.64 వేల కోట్లు కోల్పోయారు. ఆయన పోర్ట్‌ఫోలియో విలువ రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.1.67లక్షల కోట్లకు తగ్గింది. ఒక్క దమానీ మాత్రమే కాదు ప్రముఖ మదుపరి దివంగత రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా కుటుంబం సైతం 18 శాతం విలువను కోల్పోయింది. ప్రస్తుతం ఆ కుటుంబం పోర్ట్‌ఫోలియో విలువ రూ.59,709 కోట్లుగా ఉంది. వీరితో పాటు హేమంత్ కొఠారి 28 శాతం, ఆకాశ్ బన్సాలీ 15 శాతం చొప్పున వారి పోర్ట్‌ఫోలియోలు క్షీణించాయి. ముకుల్ అగర్వాల్, ఆశిష్ ధావన్, నిమేశ్ షా, యుసఫ్ఫాలీ కదేర్, ఆశిష్ కచోలియా, అనిల్ కుమార్ గోయల్ వంటి వారు ఈ టాప్-10 జాబితాలో ఉన్నారు. వీరితో పాటు విజయ్ కేడియా, హితేష్ దోషి, విశ్వాస్ పటేల్, అనుజ్ సేథ్ వంటి పేరొందిన మదుపర్ల సంపదా ఆవిరైంది.

# స్మార్ట్‌టీవీల కోసం జియోటెలీ ఓఎస్




రిలయన్స్ జియో సంస్థ స్మార్ట్‌టీవీల కోసం జియోటెలీ ఓఎస్‌ను తీసుకొచ్చింది. భారతీయ ప్రేక్షకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. స్మార్ట్‌టీవీ కంటెంట్‌ను మరింత మందికి చేరువ చేయడం, ప్రాంతీయ కంటెంట్‌ను అందించడం జియోటెలీ ఓఎస్ ముఖ్య ఉద్దేశం అని కంపెనీ తెలిపింది. అందుబాటు ధరలో ప్రీమియం కంటెంట్‌ను, స్మార్ట్‌టీవీ ఫీచర్లు జియోటెలీ ఓఎస్‌తో సాధ్యమవుతుందని పేర్కొంది. థామ్సన్, కోడక్, బీపీఎల్, జేవీసీ బ్రాండ్లు.. జియోటెలీ ఓఎస్‌తో పనిచేసే టీవీలు ఫిబ్రవరి 21 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నాయని కంపెనీ తెలిపింది. ఈ ఏడాది చివరికల్లా మరిన్ని బ్రాండ్లు ఈ ప్లాట్‌ఫామ్‌పై స్మార్ట్‌టీవీలు తేనున్నాయని పేర్కొంది.

### ప్రధాన ఫీచర్లు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఈ ఆపరేటింగ్ సిస్టమ్ పర్సనలైజ్డ్ కంటెంట్‌ను సిఫార్సు చేస్తుంది.
- 4కె కంటెంట్ అందించే టీవీల్లోనూ ల్యాగ్ అనే సమస్య ఉత్పన్నం కాదని, స్మూత్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుందని తెలిపింది.
- టీవీ ఛానెళ్లతో పాటు ఓటీటీ స్ట్రీమింగ్ యాప్స్, క్లౌడ్ గేమింగ్ వంటివీ లభిస్తాయి. సింగిల్ రిమోట్‌తో అన్ని రకాల కంటెంట్‌ను యాక్సెస్ చేయొచ్చు.
- కొత్త యాప్స్‌కు సపోర్ట్ చేసే విధంగా, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొంటూ ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ అందిస్తామని కంపెనీ చెబుతోంది.
- జియో సంస్థ గతంలో జియోటీవీ ఓఎస్‌ను తీసుకొచ్చింది. జియో సెట్‌టాప్ బాక్సులకు సపోర్ట్ చేసే విధంగా టీవీ ఓఎస్‌ను తీసుకొచ్చారు. తాజాగా తీసుకొచ్చిన జియో టెలీ ఓఎస్‌తో ఆయా బ్రాండ్లు టీవీలను విడుదల చేయనున్నాయి.

- ప్యూర్‌ఈవీతో జియో థింగ్స్ జట్టు
- ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీతో జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో థింగ్స్ లిమిటెడ్ ఎంఓయూ కుదుర్చుకుంది. దీని ప్రకారం జియో థింగ్స్ స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లు, టెలీమ్యాటిక్స్‌ను ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్యూర్ ఈవీ నుసంధానించనుంది. అధునాతన ఐవోటీ సొల్యూషన్స్ ద్వారా తమ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనదారులకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు జియోథింగ్స్‌తో జట్టుకట్టినట్లు కంపెనీ తెలిపింది.

# రియల్‌మీ నుంచి రెండు కొత్త మొబైల్స్

## ఏఐ ఫీచర్లతో పీ3 ప్రో 5జీ

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ సిరీస్‌లో రెండు కొత్త మొబైల్స్ లాంచ్ చేసింది. ఆకర్షణీయమైన లుక్‌తో దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. రియల్‌మీ పీ3 ప్రో 5జీ, రియల్‌మీ పీ3ఎక్స్ పేరిట వీటిని యూజర్లకు పరిచయం చేసింది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, ఆండ్రాయిడ్ 15, 6,000 బ్యాటరీ సదుపాయంతో తీసుకొచ్చిన ఈమొబైల్స్ ధర, ఫీచర్లు ఇవే..



### రియల్‌మీ పీ3 ప్రో 5జీ

రియల్‌మీ కొత్త మొబైల్‌లో 6.83 అంగుళాల 1.5కె కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120రిఫ్రెష్ రేటు, 1200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత రియల్‌మీ యూఐ 6.0తో పనిచేస్తుంది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్3 కలిగి ఉంటుంది. కెమెరాల విషయానికొస్తే.. 50 ఎంపీ సోనీ ప్రధాన కెమెరా, ముందు వైపు 16 ఎంపీ సోనీ సెల్ఫీ కెమెరా అమర్చారు.ఏఐ బెస్ట్ ఫేస్, ఏఐ ఎరేజ్ 2.0, ఏఐ మోషన్ డెబ్లర్, ఏఐ రిఫ్లెక్షన్ రిమూవర్ వంటి ఏఐ ఫీచర్లు కూడా ఇందులో జోడించారు. ఈ మొబైల్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం 128జీబీ వేరియంట్ ధర రూ.23,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.24,999గా, 12జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.26,999గా ప్రకటించింది. గెలాక్సీ పర్పుల్, నెబులా గ్లో, సాట్నర్ బ్రౌన్ రంగుల్లో లభిస్తుంది. వీటి విక్రయాలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. రియల్‌మీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్ వేదికగా కొనుగోలు చేయొచ్చు. ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల సాయంతో కొనుగోలు చేస్తే రూ.2వేలు తగ్గింపు పొందొచ్చు.

### రియల్‌మీ పీ3 ఎక్స్

రియల్‌మీ పీ3 ఎక్స్‌లో 6.7 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120 రిఫ్రెష్ రేటు కలిగి ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6400 చిప్‌సెట్‌తో వస్తోంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 8ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఈ మొబైల్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 6జీబీ ం128జీబీ వేరియంట్ ధర రూ.13,999గా, 8జీబీ ం128జీబీ వేరియంట్ ధర రూ.14,999గా కంపెనీ నిర్ణయించింది. లునార్ సిల్వర్, మిడ్‌నైట్ బ్లూ, స్టెల్లార్ పింక్ రంగుల్లో లభిస్తాయి. ఫిబ్రవరి 28 నుంచి వీటి విక్రయాలు ప్రారంభమవుతాయి. ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల సాయంతో కొనుగోలు చేస్తే వెయ్యి రుపాయలు తగ్గింపు ప్రకటించింది. రెండు మొబైల్స్ వైఫై, బ్లూటూత్, యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్ వంటి కనెక్టివిటీ సదుపాయాలతో వస్తున్నాయి.




## ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది

### - కాగ్నిజెంట్ సంచలన ఆరోపణలు

ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలైన కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. యూఎస్‌లో ఓ దావాపై ఈ ఇరు సంస్థలు గత కొంతకాలంగా పోరాడుతున్నాయి. ఈనేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ పెద్దఎత్తున ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తమ హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలని ఇన్ఫీ దొంగిలించిందని విమర్శించింది. ఈవిషయాన్ని ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నాన్ డిస్‌క్లోజర్ అండ్ యాక్సెస్ అగ్రిమెంట్ ద్వారా ట్రైజెట్టో వాణిజ్య రహస్యాలను దుర్వినియోగం చేస్తూ ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిందంటూ కాగ్నిజెంట్ ఆరోపించింది. అంతేకాదు ఈవిషయంపై ఆడిట్ చేసేందుకు ఆ కంపెనీ నిరాకరించిందని కాగ్నిజెంట్ తెలిపింది. హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలను ఇన్ఫోసిస్ దొంగిలించిందని ఆరోపించిన కాగ్నిజెంట్ 2024 ఆగస్టులో అమెరికా కోర్టులో దావా వేసింది. ఈ ఆరోపణల్ని ఇన్ఫోసిస్ తిరస్కరించింది. కాగ్నిజెంట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ బహిరంగంగా ఉన్నాయని తెలిపింది. అంతేకాదు.. ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో ఉన్న రవికుమార్.. తమవద్ద పనిచేసిన సమయంలో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ విడుదల చేయడాన్ని ఆలస్యం చేశారని ఇన్ఫోసిస్ ప్రత్యారోపణలు చేసింది. కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కోసం ఆయన చర్చలు జరిపారని పేర్కొంది. ఇన్ఫోసిస్ అధ్యక్షుడిగా వ్యవహరించిన రవికుమార్ 2022 అక్టోబర్‌లో ఆ సంస్థను విడిచిపెట్టారు. ఆ మరుసటి ఏడాది జనవరిలోనే కాగ్నిజెంట్‌లో సీఈఓగా చేరారు. ఈ రెండు ఐటీ కంపెనీలు ఆరోగ్య సంరక్షణ సేవల రంగంలో పోటీపడుతున్నాయి. ఇన్ఫోసిస్ ఆదాయంలో దాదాపు 7.5 శాతం లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి పొందుతోంది.

## రూ.5 లక్షలకు మించినా డిపాజిట్ బీమా!

### పెంపు ప్రతిపాదనల్లో ప్రభుత్వం



**ముంబయి:** బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు వర్తించే బీమా గరిష్ఠ పరిమితిని రూ.5 లక్షల నుంచి పెంచాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం. నాగరాజు సోమవారం వెల్లడించారు. ముంబయికి చెందిన న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ మోసం బహిర్గతం అయిన కొద్ది రోజులకే, ఈ ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు ఆయన వివరించడం గమనార్హం. 'డిపాజిట్ బీమా పరిమితిని పెంచాలనే అంశం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం ఆమోదించాక దాన్ని అమలు చేస్తాం' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఏదైనా బ్యాంక్, తన ఖాతాదార్లకు డిపాజిట్ మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) ఆ మొత్తాన్ని చెల్లిస్తుంది. ఈ మొత్తం రూ.5 లక్షలకు పరిమితం. (2020 వరకు ఇది రూ.లక్షగా ఉండేది) ఇందుకుగాను ఈ సంస్థ బ్యాంకుల నుంచి ప్రీమియాన్ని వసూలు చేస్తుంది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఉన్న 1.3 లక్షల డిపాజిటర్లలో 90 శాతం మందికి డీఐసీజీసీ కింద పూర్తి మొత్తం లభిస్తుంది. బ్యాంక్ పుస్తకాల్లో చూపించిన రూ.122 కోట్ల నగదు వాస్తవంగా లేదనే నిజం తనిఖీలో బయటపడింది. బ్యాంక్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ హితేశ్ మెహతా ఒక స్థానిక బిల్డరుకు ఈ మొత్తాన్ని అక్రమంగా అందించినట్లు తేలింది.

# 2023 ప్రపంచకప్ తర్వాత 9 వన్డేలే..

## ఈ సన్నద్ధత సరిపోతుందా..?



**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి మరికొన్ని గంటలే సమయం ఉంది. భారత బృందం ఇప్పటికే దుబాయ్ చేరుకొంది. ఈసారి టీమ్ ఇండియా బ్యాటింగ్ ఆర్డర్ డెప్త్ ఎక్కువగా ఉందని విశ్లేషకులు అంగీకరిస్తున్నారు. కాకపోతే వన్డే ఫార్మాట్‌కు సన్నద్ధతే కొంత ఆందోళనకరంగా ఉంది. 2017 నుంచి ఐసీసీ వన్డే టోర్నమెంట్ల సమయంలో సన్నద్ధతతో పోలిస్తే ఈసారి పరిస్థితి అంత గొప్పగా ఏమీలేదు. ప్రతి ఫార్మాట్‌కు ఓ వ్యూహం ఉంటుంది. దానికి అలవాటు పడాలంటే కనీస సన్నద్ధత అవసరం. టీమ్ ఇండియా 2023 ప్రపంచకప్ తర్వాత నుంచి ఎలా సిద్ధమైందో చూద్దాం..**

ఇంగ్లండ్‌లో సిరీస్ నాటికి కూడా టీమ్ ఇండియా జట్టు పూర్తిగా సన్నద్ధం కాకపోవడం గమనార్హం. ఈ సిరీస్ సమయానికి జట్టులో స్థానంపై అయ్యర్‌కే అనుమానం ఉంది. ఈ విషయాన్ని నాడు తొలి మ్యాచ్ అనంతరం అయ్యర్ మాట్లాడుతూ.. కోహ్లీ లేకపోవడం వల్లే తనకు అవకాశం వచ్చిందన్నాడు. అర్ష్‌దీప్, హర్షిత్‌రాణా విషయంలోనూ ఇదే గందరగోళం. ఓపెనర్‌గా రోహిత్ భాగస్వామి ఎవరనేదానిపై గిల్, యశస్వీల మధ్య దోబూచులాట. వరుణ్ చక్రవర్తి పరిస్థితి కూడా ఇదే.

### గతంతో పోల్చుకొంటే సన్నద్ధత తక్కువే..

- 2017లో ఛాంపియన్స్ ట్రోఫీకి ఏడాది ముందు భారత్ 11 వన్డేలు ఆడగా.. 26 మంది ఆటగాళ్లకు అవకాశం లభించింది.
- 2019 ప్రపంచకప్‌నకు ముందు 27 మ్యాచ్‌లు ఆడగా.. 26 మంది ఆటగాళ్లతో ప్రయోగాలు చేసింది.
- అదే 2023 వన్డే ప్రపంచకప్‌నకు ముందు ఏడాదిలో భారత్ ఏకంగా 30 మ్యాచ్‌లు ఆడింది.. వీటిల్లో దాదాపు 34 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి అనేది ఎరగకుండా ఫైనల్స్‌కు చేరింది.
- 2023 ప్రపంచకప్ తర్వాత ఇప్పటివరకు భారత్ 9 మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. వీటిల్లో 27 మంది ఆటగాళ్లను వాడింది. అదే వన్డే ప్రపంచకప్ తర్వాత టీ 20లు మాత్రం 38 ఆడింది. వీటిల్లో 18 పొట్టి ప్రపంచకప్‌లు జరిగాయి. ఆ ఫలితం ఆ టోర్నీపై చూపింది. ఇక వన్డే ఫార్మాట్ ప్రిపరేషనే కొంత ఆందోళనకరం. శ్రీలంక సిరీస్ ఘోర ఓటమి పీడకలే.
- ఇక ఛాంపియన్స్ ట్రోఫీ ఆడుతున్న జట్లలో భారత్ మాత్రమే గత వన్డే ప్రపంచకప్ ముగిశాక అతితక్కువ వన్డేలు ఆడింది. ఆస్ట్రేలియా 12, దక్షిణాఫ్రికా 14, పాకిస్థాన్ 11, ఇంగ్లాండ్ 14, అఫ్గానిస్థాన్ 14, న్యూజిలాండ్ 11, బంగ్లాదేశ్ 12 ఆడాయి.

### డ్యూఫ్యాక్టర్ ఆందోళనకరం..

యూఏఈలో పిచ్‌లపై డ్యూఫ్యాక్టర్ అధికంగా ఉండటంతో అవి నెమ్మదిగా ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో టాస్ కీలకంగా మారనుంది. ఈనేపథ్యంలో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఏమేరకు సత్ఫలితాలు ఇస్తుందో వేచి చూడాలి. గతంలో జరిగిన ఐపీఎల్ డే అండ్ నైట్ మ్యాచ్‌ల్లో ఇవి సీమర్లకు మాత్రమే ఎక్కువ సహకరించినట్లు చెబుతున్నాయి. 2018 నుంచి 35 మ్యాచ్‌ల రికార్డులు చూస్తే ఆసీస్, పాక్ మాత్రమే 300కు పైగా స్కోర్లు చేశాయి. ఈ మ్యాచ్‌ల గణాంకాల ప్రకారం తొలి ఇన్నింగ్స్ సగటు మొత్తం 218, విజయం సాధించడానికి అవసరమైన సగటు స్కోరు 252. తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు 14 సార్లు గెలువగా.. 19 సార్లు ఓడిపోయాయి. ఒకటి టై కాగా.. మరొకటి ఫలితం తేలలేదు.



# బీసీసీఐ యూటర్న్..

## ఫ్యామిలీని వెంట తెచ్చుకోవచ్చు కానీ..!

బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఘోర పరాభవం తర్వాత ఆటగాళ్లు, స్టాఫ్‌కు సంబంధించి బీసీసీఐ కఠిన నిబంధనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ఇకపై క్రికెటర్లు తమ భాగస్వాములు, కుటుంబసభ్యులను వెంట తీసుకెళ్లడం సహా పలు సౌకర్యాల విషయంలో కొన్ని ఆంక్షలు విధించింది. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. తాజాగా ఈ 'నో ఫ్యామిలీ రూల్' నుంచి ఆటగాళ్లకు కాస్త ఊరటనిచ్చినట్లు తెలుస్తోంది. దుబాయ్‌కి ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులను వెంట తెచ్చుకోవచ్చని బోర్డు చెప్పిందట. అయితే, ఇందుకో షరతు పెట్టినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీలో కేవలం ఒకేఒక్క మ్యాచ్‌కు మాత్రమే ఆటగాళ్ల వెంట కుటుంబసభ్యులను అనుమతిస్తామని బీసీసీఐ చెప్పినట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఫ్యామిలీని వెంట తెచ్చుకునే విషయం గురించి ఆటగాళ్లందరూ చర్చించుకొని ఆ తర్వాత అభ్యర్థన చేసుకోవాలని బీసీసీఐ చెప్పినట్లు సమాచారం. అందుకు అనుగుణంగా బోర్డు ఏర్పాట్లు చేయనున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. బీసీసీఐ నిర్ణయించిన '10 పాయింట్ల' పాలసీ ప్రకారం.. నెల రోజుల పర్యటన ఉంటేనే ఒక వారం కుటుంబసభ్యులతో ఉండేందుకు వీలుండేది. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ప్రారంభమై.. మార్చి 9న ముగుస్తుంది. దీంతో ఈ టోర్నీకి క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు అనుమతించడం లేదని అంతకుముందు బీసీసీఐ వెల్లడించింది. దీనిపై ఓ సీనియర్ క్రికెటర్ నుంచి వినతి వచ్చినా.. ఎవరికీ మినహాయింపు ఇవ్వలేమని బోర్డు అప్పుడు తేల్చిచెప్పింది. అయితే, ప్రస్తుతం టోర్నీ పరిస్థితులను దృష్టిలోఉంచుకొని.. ఒక్క మ్యాచ్‌కు మాత్రం ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులను వెంట తెచ్చుకునేందుకు అనుమతినిచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఏ మ్యాచ్‌కు బోర్డు ఈ మినహాయింపు ఇవ్వనుందనే విషయం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. బుధవారం నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. భారత్ ఆడే మ్యాచ్‌లు తటస్థ వేదిక అయిన దుబాయ్‌లో జరగనున్నాయి. ఇప్పటికే టీమ్‌ఇండియా బృందం అక్కడికి చేరుకుంది. ఈ టోర్నీలో రోహిత్ సేన ఫిబ్రవరి 20న తన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.



## ఆ బంతితో నా కాలు విరగ్గొడతావా..?

### బౌలర్‌ను మెచ్చుకున్న రోహిత్

ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీలో తొలి మ్యాచ్ ఆడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. ఇప్పటికే దుబాయ్ చేరుకుని ప్రాక్టీస్‌లో నిమగ్నమైన భారత ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్ర సాధన చేస్తున్నారు. ఇక ఇటీవలే ఫామ్ అందుకుని జోరు మీదున్న కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడు పెంచాడు. నెట్స్‌లో అన్ని రకాల షాట్లు ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. అయితే.. అతడిని ఓ లోకల్ బౌలర్ తన బంతులతో ఇబ్బంది పెట్టాడు. ఈ విషయాన్ని స్వయంగా హిట్‌మ్యానే వెల్లడించాడు. నెట్స్‌లో స్థానిక లోకల్ పాస్ట్ బౌలర్ అవాయిస్ అహ్మద్ తన పదునైన బంతులతో రోహిత్‌ను పరీక్షించాడు. ఇన్‌స్వింగింగ్ యార్కర్లు సంధించి ఇబ్బంది పెట్టాడు. ట్రైనింగ్ సెషన్ పూర్తయిన తర్వాత ఆ బౌలర్‌ను రోహిత్ ప్రశంసించాడు. 'క్లాస్ బౌలర్' అంటూ అతడిని మెచ్చుకున్నాడు. "నువ్వు ఇన్‌స్వింగింగ్ యార్కర్లతో నా కాలు విరగ్గొట్టేందుకు ప్రయత్నించావు. గొప్ప బౌలింగ్. మా ట్రైనింగ్ సెషన్‌లో మీరంతా సహాయం చేసినందుకు కృతజ్ఞతలు" అంటూ అతడి బౌలింగ్‌ను కొనియాడాడు. ఇక గత కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రోహిత్ శర్మ ఇటీవల ఇంగ్లాండ్‌తో రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. 119 పరుగులు చేసి తిరిగి తన మునుపటి ఫామ్‌ను అందుకున్నాడు. తనదైన షాట్లను అలవోకగా కొడుతూ పాత రోహిత్‌ను గుర్తు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు రోహిత్‌తో పాటు మరో స్టార్ బ్యాటర్ కోహ్లీ కూడా తిరిగి ఫామ్‌లోకి రావడం టీమ్‌ఇండియాకు శుభపరిణామం. ఈ టోర్నీయే వీరికి చివరిదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. గొప్పగా రాణించి, టీమ్‌ఇండియాకు మరో ఐసీసీ ట్రోఫీని అందించాలని అభిమానులు కోరుతున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఈ నెల 20న దుబాయ్ వేదికగా బంగ్లాతో తొలి మ్యాచ్ ఆడనుంది.

# టీమ్‌ఇండియా జెర్సీలపై పాకిస్థాన్ పేరు



ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. తన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఈనెల 20న దుబాయ్ వేదికగా తలపడనుంది. ఈ నేపథ్యంలో నూతన జెర్సీల్లో టీమ్‌ఇండియా ఆటగాళ్లు సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను బీసీసీఐ తన అధికారిక ఎక్స్ ఖాతాలో తాజాగా పంచుకుంది. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, మహమ్మద్ షమీ తదితరులు నూతన జెర్సీలతో తాము మెగా సమరానికి సిద్ధమంటూ ఫొటోలకు పోజులిచ్చారు. ఈ జెర్సీలపై టోర్నీకి ఆతిథ్యమిచ్చే పాకిస్థాన్ పేరు ఉంది.

అయితే.. భారత జెర్సీలపై పాక్ పేరును తొలగించాలంటూ గతంలో పలువురు అభిమానులు డిమాండ్ చేయగా బీసీసీఐ స్పష్టత ఇచ్చిన విషయం తెలిసిందే. "టోర్నమెంట్ సమయంలో క్రికెట్ బోర్డు, భారత జట్టు.. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆదేశాలకు కట్టుబడి ఉంటుంది. ఆ ఆదేశాలను ఉల్లంఘించాలని మేము అనుకోవడం లేదు. పేరు తొలగించాలని ఎలాంటి డిమాండ్ చేయలేదు. జెర్సీలపై ఉండే ట్రోఫీకి సంబంధించిన లోగోపై తమ దేశం పేరు ఉండేందుకు ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్‌కు హక్కు ఉంటుంది" అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టంచేశారు.

### జట్టును వీడిన బౌలింగ్ కోచ్..

ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమ్‌ఇండియాకు బ్యాడ్ న్యూస్. జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వ్యక్తిగత కారణాలతో దుబాయ్ వీడాడు. తన తండ్రి మరణంతో అతడు దుబాయ్ నుంచి స్వదేశానికి పయనమైనట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఈనెల 15న దుబాయ్ చేరుకున్న టీమ్‌ఇండియా బృందంలో మోర్కెల్ ఉన్నాడు. ఆ తర్వాత జరిగిన పలు ట్రైనింగ్ సెషన్లలోనూ పాల్గొన్నాడు. అయితే.. సోమవారం మాత్రం ప్రాక్టీస్ సెషన్‌కు అతడు రాలేదు. అనివార్య కారణాలతో అతడు జట్టును వీడినట్లు ఆ తర్వాత వార్తలు వచ్చాయి. అయితే.. అతడు ఎప్పుడు తిరిగి వచ్చే దానిపై మాత్రం స్పష్టత లేదు. అతడు లేకపోవడం ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియాకు లోటేనని పలువురు అంటున్నారు.



## కివీస్‌కు బిగ్ షాక్..

### చాంపియన్స్ ట్రోఫీకి మరో స్టార్ బౌలర్ దూరం

చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ఒక్క రోజు ముందు న్యూజిలాండ్‌కు భారీ షాక్ తగిలింది. కివీస్ స్టార్ పేసర్ ఫెర్గూసన్ గాయం కారణంగా ఐసీసీ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఆదివారం అఫ్గానిస్తాన్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఫెర్గూసన్ కాలి గాయమైంది. కుడి పాదంతో అసౌకర్యంగా కనిపించాడు. గాయం నుంచి కోలుకోవడానికి ఫెర్గూసన్‌కు సమయం పట్టనుంది. టోర్నీలో పాల్గొనేంత ఫెర్గూసన్ ఫిట్‌గా లేడని న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. అతన్ని తిరిగి న్యూజిలాండ్‌కు పంపించనున్నట్టు పేర్కొంది. కివీస్ బోర్డు ఫెర్గూసన్ స్థానంలో మరో ఫాస్ట్ బౌలర్ కైల్ జేమీసన్‌ను జట్టులోకి తీసుకుంది. జేమీసన్ చివరిసారిగా 2020లో చివరి వన్డే మ్యాచ్ ఆడాడు. చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన రెండో కివీస్ ఆటగాడు ఫెర్గూసన్. పేసర్ బెన్ సియర్స్ తొడ కండరాల గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో జాకబ్ డఫీని భర్తీ చేసిన విషయం తెలిసిందే.

## రోహిత్, కోహ్లీలకు చాంపియన్స్ ట్రోఫీనే

# ఆఖరి ఐసీసీ టోర్నీనా?



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దశాబ్దానికిపైగా భారత క్రికెట్‌కు మూల స్తంభాలు. అయితే, ఎంతటి దిగ్గజ ఆటగాడైనా ఏదో ఒక సమయంలో ఆటకు వీడ్కోలు పలికాల్సిందే. ప్రస్తుతం రోహిత్, కోహ్లీలదీ అదే పరిస్థితి. వీరిద్దరూ గతేడాది టీ20 కెరీర్‌ను ఘనంగా ముగించారు. టీ20 వరల్డ్ కప్ టైటిల్‌తో పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పారు. ఇప్పుడు వీళ్లిద్దరి వన్డే రిటైర్మెంట్ గురించి చర్చ జరుగుతుంది. వన్డేలకు ఘనంగా వీడ్కోలు పలకడానికి వారికి చాంపియన్స్ ట్రోఫీ అద్భుతమైన చాన్స్. కెరీర్ చరమాంకంలో ఉన్న రోహిత్, కోహ్లీలు మరో ఐసీసీ టోర్నీ ఆడే ఆస్కారం లేదు. గతేడాది టీ20 ప్రపంచకప్‌కు ముందు రోహిత్, కోహ్లీ చాలా కాలంపాటు టీ20లు ఆడలేదు. యువకులకు అవకాశాలు ఇచ్చారు. కానీ, టీ20 వరల్డ్ కప్‌కు ముందు టీ20ల్లోకి పునరాగమనం చేశారు. టీ20 ప్రపంచకప్ గెలిచారు. టీ20లకు సంతృప్తికరంగా ముగింపు పలికారు. ఇప్పుడు రోహిత్ వయసు 37 ఏళ్లు. కోహ్లీ వయసు 36 ఏళ్లు. వీరు ఇంకా ఎన్నో ఏళ్లు జాతీయ జట్టుకు ఆడలేరనేది వాస్తవం. కొంతకాలంగా వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తారని వార్తలు వస్తున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీడ్కోలు చెబుతారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వయసు పరంగా, ఫామ్ పరంగా చూస్తే రోహిత్, విరాట్ మరో ఐసీసీ టోర్నీ ఆడే అవకాశం లేదు. ఈ ఏడాది జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు భారత్ అర్హత సాధించలేదు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించారు కాబట్టి వచ్చే ఏడాది జరిగే పొట్టి ప్రపంచకప్ ఆడలేరు. 2027లో వన్డే వరల్డ్ కప్ జరగనుంది. అప్పటి వరకు రోహిత్, కోహ్లీ వన్డేలు ఆడటం డౌటే. ఏ రకంగా చూసినా వాళ్లిద్దరికీ చాంపియన్స్ ట్రోఫీనే ఆఖరి ఐసీసీ టోర్నీ.

### అందరి దృష్టి వారిపైనే

చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తారన్న వార్తల నేపథ్యంలో రోహిత్, కోహ్లీలపైనే అందరి దృష్టి నెలకొంది. చాంపియన్స్ ట్రోఫీలోనూ సత్తాచాటి వన్డేలకు కూడా ఘనంగా ముగింపు పలుకుతారని అభిమానులు ఆశిస్తున్నారు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఇద్దరికీ మంచి రికార్డే ఉంది. కోహ్లీ సగటు 58గా ఉన్నది. రోహిత్ సగటు 49. చివరి పది వన్డే ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ రెండు శతకాలు, నాలుగు హాఫ్ సెంచరీలు చేశాడు. రోహిత్ ఖాతాలో ఓ సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మరో మూడు సందర్భాల్లో 50 మార్క్‌కు తృటిలో కోల్పోయాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లోనూ ఆకట్టుకున్నారు. రెండో వన్డేలో హిట్‌మ్యాన్ శతకం బాదగా.. మూడో వన్డేల్లో కోహ్లీ హాఫ్ సెంచరీ నమోదు చేసి చాంపియన్స్ ట్రోఫీ ముందు ఫామ్ అందుకున్నారు. దుబాయ్ పిచ్‌లపై ఆడిన అనుభవం కూడా ఉన్నది. చాంపియన్స్ ట్రోఫీలో వీరు రాణించి భారత్‌కు మరో ఐసీసీ టైటిల్ అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

## అతడితో జాగ్రత్త.. మన గేమ్‌ను దెబ్బతీయొచ్చు

### రోహిత్ సేనకు హర్భజన్ హెచ్చరిక



పాకిస్థాన్ ఆతిథ్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి అంతా సిద్ధమైంది. పాకిస్థాన్‌లో ఆడేది లేదని టీమ్‌ఇండియా తేల్చి చెప్పడంతో.. ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌కు మార్చిన విషయం తెలిసిందే. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–పాక్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్ వేదికగా జరగనుంది. దీనిపై రోహిత్ సేనను టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ హెచ్చరించాడు. పాక్ క్రికెటర్ ఫకర్ జమాన్ ఉద్దేశించి వ్యాఖ్యలు చేశాడు. "భారత్ నుంచి గెలుపును దూరం చేసిన అనుభవం ఫకర్‌కు ఉంది. అతడితో జాగ్రత్త.. మన విజయావకాశాలను దెబ్బతీయొచ్చు" అని తన యూట్యూబ్ ఛానల్ వేదికగా వెల్లడించాడు. వన్డేల్లో భారత్‌పై ఫకర్‌కు మంచి రికార్డు ఉంది. టీమ్‌ఇండియాపై ఆడిన ఆరు మ్యాచుల్లో 46.80 సగటుతో 234 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ 82.39గా ఉంది. ఇదిలా ఉంటే.. ఈనెల 23న దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ గురించి పలువురు మాజీలు తమ అంచనాలు ఇప్పటికే వెల్లడిస్తున్నారు. దాయాదుల మధ్య జరిగే పోరులో గొప్ప ప్రదర్శన చేసే ఆటగాళ్లు ఎవరో ఇటీవల టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్, పాక్ మాజీ కెప్టెన్లు ఇంజమామ్, షాహిద్ అఫ్రిదీ అంచనా వేశారు. మ్యాచ్ విజయంలో కీలకంగా ఏ ఆటగాళ్లు మారుతారన్న ప్రశ్నకు.. టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పేరును యువరాజ్ చెప్పాడు. రిజ్వాన్ పేరును అఫ్రిదీ పేర్కొనగా.. ఇంజమామ్.. ఫకర్ జమాన్ పేరు సూచించిన సంగతి తెలిసిందే.

## రోహిత్‌కు ఇది ఎన్నో ఐసీసీ టోర్నీనో తెలుసా..



విరాట్, రోహిత్, జడ్డూ,షమీ వంటి సీనియర్లతో టీమ్ ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీకి సిద్ధమైంది. తాజాగా దుబాయ్‌లో జట్టు యాడ్‌షాట్ ఫొటో షూట్‌లో పాల్గొంది. దీనికి జడేజా–రోహిత్ కలిసి ఒకే కారులో వెళ్లారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య సరదా సంభాషణ చోటు చేసుకొంది. పెద్ద గడ్డంతో ఉన్న జడ్డూను చూసి రోహిత్ నువ్వు ఇలానే ఫొటోషూట్ చేస్తావా..? అని ప్రశ్నించాడు. దానికి అవును అని జడ్డూ సమాధానం ఇచ్చాడు. రోహిత్ స్పందిస్తూ.. "ఇది నాకు 15వది అనుకుంటా. 9 టీ20 ప్రపంచకప్‌లు, 3 వన్డే ప్రపంచకప్‌లు, రెండు ఛాంపియన్స్ ట్రోఫీలు. ఇప్పుడు మూడోది. మొత్తం 15 కదా. అరే కాదు.. ప్రపంచ టెస్ట్‌ఛాంపియన్ షిప్‌లు రెండు. మొత్తం 17 సార్లు పిలిచారు" అని రోహిత్ తన రికార్డు వెల్లడించి.. నీవి కూడా అన్నే ఉంటాయి కదా..? అని ప్రశ్నించాడు. జడ్డూ దీనికి స్పందిస్తూ.."లేదు.. 2007, 2011లో నేను ఆడలేదు" అని జవాబిచ్చాడు. అనంతరం వీరు ఫొటో షూట్ ముగించుకొన్నారు. అనంతరం జడ్డూకు గిల్ ఎదురుపడగా.. ఇది ఎన్నో ఫొటో షూట్ అని అడిగాడు..? దానికి లెక్కపెట్టుకొన్న అతడు ఐదోదని చెప్పాడు. అనంతరం కోహ్లీ, షమీ, పంత్, అయ్యర్ వంటివారు ఫొటోషూట్‌ను పూర్తి చేసుకొన్నారు. టీమ్ ఇండియాకు నూతన జెర్సీని సోమవారం విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటో షూట్‌నే నేడు నిర్వహించారు. బీసీసీఐ తన అధికారిక ఎక్స్ ఖాతాలో తాజాగా పంచుకుంది. ఈ జెర్సీలపై టోర్నీకి ఆతిథ్యమిచ్చే పాకిస్థాన్ పేరు ఉంది. అయితే.. భారత జెర్సీలపై పాక్ పేరును తొలగించాలంటూ గతంలో పలువురు అభిమానులు డిమాండ్ చేయగా బీసీసీఐ స్పష్టత ఇచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిబంధనలకు కట్టుబడి జెర్సీలను వాడతామని గతంలోనే పేర్కొంది. జెర్సీలపై ఉండే ట్రోఫీకి సంబంధించిన లోగోపై తమ దేశం పేరు ఉండేందుకు ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్‌కు హక్కు ఉంటుంది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ధ్రువీకరించారు.



## అల్లుఅర్జున్‌తో రోమాన్స్ చేయనున్న జాన్వీకపూర్

ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ నటించిన పుష్ప-2 మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పుష్ప తర్వాత బన్నీ ఏం సినిమా చేయబోతున్నాడనే చర్చ సాగుతున్నది. సమాచారం మేరకు అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేయనున్నాడనే వార్త తెగ వైరల్‌గా మారింది. అయితే, ఈ ప్రాజెక్టు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉ ందని.. ఈ మూవీని పక్కన పెట్టి బన్నీ తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీతో సినిమా చేయనున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. చాలారోజులుగా బన్నీతో అట్లీ సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇద్దరి కాంబోలో హై యాక్షన్ సినిమా తెరకెక్కించనున్నట్లు టాక్ నడుస్తున్నది. త్వరలోనే వివరాలను ప్రకటించనున్నారు. ఇక అల్లు అర్జున్‌తో జాన్వీ కపూర్ రొమాన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. జాన్వీ కపూర్ తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది.



## భాగ్యశ్రీకి వరుస ఆఫర్లు

ఔరా అనిపించే ఔరంగబాద్ అందం భాగ్యశ్రీ బోర్సే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ అగ్ర కథానా యకుడు సూర్య సరసన నటించే ఛాన్స్ ఈ ముద్దుగుమ్మని వరించినట్టు చెన్నై మీడియాలో బలంగా వార్తలొస్తున్నాయి. సూర్య కథానాయకుడిగా తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటైర్టైన్మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఖాయం అయ్యిందట. మే నెలలో షూటింగ్ మొదలు కానున్నట్టు సమాచారం. తొలి సినిమా 'మిస్టర్ బచ్చన్' ఫలితం ఎలా ఉన్నా.. భాగ్యశ్రీబోర్సే మాత్రం అందంతో మార్కులు కొట్టేసి యూత్‌ని కట్టిపడేసింది. అందుకే ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు క్యూ కట్టాయి.

## ఈ చిత్రాన్ని అందరూ చూడండి

### 'అనుజా'పై ప్రియాంక పోస్ట్

ఈ ఏడాదిలో ఆస్కార్ పోటీల్లో నిలిచి భారత్ ఆశలను సజీవం చేసింది 'అనుజా' లఘు చిత్రం. స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ చిత్రం ఇటీవల నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. తాజాగా దీనిపై ప్రియాంక పోస్ట్ పెట్టారు. దీనికి అనూహ్యమైన స్పందన వస్తోందన్నారు. ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికాలో విడుదలైన ఈ చిత్రానికి అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లోనూ దీన్ని ప్రదర్శించగా.. కొన్నింట్లో వివిధ విభాగాల్లో విజేతగా అవార్డులు కూడా దక్కాయి. సామాజిక స్పృహతో రూపొందించిన ఈ చిత్రం ఈ ఏడాది ఆస్కార్ అవార్డుల బరిలోనూ నిలిచింది. తాజాగా ఈవిషయాన్ని మరోసారి గుర్తుచేశారు ప్రియాంక. "ప్రతిష్టాత్మక అవార్డుల బరిలో నిలిచిన ఈ సినిమాను అందరూ చూడాలని నేను సిఫార్సు చేస్తున్నా. ఇది అద్భుతమైన చిత్రం" అని పేర్కొన్నారు. ఇదీ అనుజా కథ: దిల్లీకి చెందిన అనుజా అనే తొమ్మిదేళ్ల బాలికది కడు పేద కుటుంబం. చదువుకొనే స్థోమత లేక తన అక్కతో కలిసి అక్కడి ఓ దుస్తుల ఫ్యాక్టరీలో పనిచేస్తుంటుంది. అయినా చదువుకోవాలన్న పట్టుదలతో ఉంటుంది. ఈ క్రమంలోనే పాఠశాల, చదువుకు సంబంధించిన పలు ప్రశ్నలు తన అక్కను అడుగుతుంది. ఈ విషయాలు తెలుసుకున్నాక స్కూలుకెళ్లాలన్న ఆసక్తి తనలో మరింత పెరుగుతుంది. అయితే తన కుటుంబ స్థితిగతులను దృష్టిలోపెట్టుకుని ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక సతమతమవుతు ంటుంది. ఈ క్రమంలోనే అనుకోకుండా అనుజాకు చదువుకొనే అవకాశం వస్తుంది. తదనంతర పరిస్థితులు, అక్కచెల్లెళ్ల మధ్య సరదాగా సాగే సన్నివేశాలను ఆసక్తిగా మలుస్తూ ఈ షార్ట్‌ఫిల్మ్ తెరకెక్కించారు ప్రముఖ దర్శకుడు ఆడమ్ జె గ్రేవ్స్. ఈ ఏడాది మార్చి 2న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. కోనన్ ఓబ్రియాన్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్లో సత్తా చాటిన 'ది బ్రూటలిస్ట్', 'ఎమిలియా పెరెజ్' చిత్రాలు అత్యధిక కేటగిరీల్లో నామినేషన్స్ సొంతం చేసుకున్నాయి. అలాగే ఇండియన్ షార్ట్ ఫిల్మ్ 'అనుజా' ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) కేటగిరిలో పోటీ పడనుంది.





## ఫౌజీలో యువరాణిగా అలియాభట్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్ ఎస్మాయిల్ నటిస్తుంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించ నున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్లు సమాచారం. అందుకే ఈ మూవీ టైటిల్ 'ఫౌజీ' అయితే బావుం టుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో రా నుండగా బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించను న్నారట. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరు స్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కీలకమైన బ్రిటిష్ యువరాణి పాత్రలో బాలీవుడ్ నటి ఆలియా భట్ నటించబోతు న్నట్లు వార్తలు వస్తున్నాయి. యువరాణి పాత్ర ఈ సినిమాలో కీలకం కావడంతో.. ఆలియా భట్‌ని తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ నటిస్తున్నాడు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com